క్లుప్తంగా

కూలీలకు నీటి వసతి కల్పించండి

నంద్యాల(సెంట్రల్): ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి కూలీలకు తాగునీటి వసతి ఏర్పాటు చేయటంలో అలసత్వం వద్దని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి గురువారం ఓ ప్రకటనలో సిబ్బందిని ఆదేశించారు. వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ప్రతి గంటకు ఒకసారి నీరు తాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటలకు పనులకు హాజరై 11 గంటల లోపు ముగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. గతేడాది పంపిణీ చేసిన షెడ్లను పని ప్రదేశంలో ఉపయోగించుకోవాలని ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. వాటర్ బెల్ పద్ధతిని అమలు చేసి కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీశైలం : ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైలం వచ్చిన కన్నడిగుల్లో 8 మంది బుధవారం రాత్రి మల్లమ్మ ఆలయం వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతుండగా సీఐ ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్ట్ చేశారు. సీఐ గురువారం మాట్లాడుతూ బాగల్‌కోట్ జిల్లా హిలీకల్ గ్రామానికి చెందిన మల్లేష్ (23), హనుమప్ప (24), గొడర్ మల్లు (28), హనుగుందా వర్గజన్ గ్రామానికి చెందిన కనిగిర్ అర్జున్ (29), వలికల్ నాగరాజు (21), టి.శరణప్ప (39), గోరేబడు గ్రామానికి చెందిన హనుమంతప్ప బారేకేర్ (28), హలగమని గ్రామస్తుడు ముత్తన్న(23).. మల్లమ్మ కన్నీరు ఆలయం సమీప అటవీ పరిధిలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఏఎస్ఐ గురవయ్య, పోలీసులు రవి, రంగన్న, వెంకటనారాయణ, మహేష్, శివ, బాలకృష్ణ, శంకర్‌రెడ్డితో కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.21,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

14 నుంచి శ్రీరామ కథా రసవాహిని

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నెహ్రూ నగర్‌లోని సత్యసాయి మందిరంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు శ్రీరామ కథా రస వాహిని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా సమితి జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీరామ కథా రస వాహిని పేరుతో శ్రీమద్ రామాయణంలోని ముఖ్యమైన పాత్రలపై మూడో రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. చిన్మయ మిషన్ ప్రవచకులు స్వామిని సుప్రేమానంద సరస్వతి ప్రవచనం చెబుతారని తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.

హెల్త్ ఫౌండేషన్‌ను రద్దు చేయాలి



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

బొమ్మలసత్రం: యోగా టీచర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాయ మాటలు చెప్పి పలువురి నుంచి రూ.3లక్షల నుంచి రూ.5లక్షలు వసూలు చేసి ఇప్పటివరకు వారికి జీతాలు కూడా ఇవ్వని బుద్ధ హెల్త్ ఫౌండేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏఐవైఎఫ్ నాయకుడు నాగరాముడు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్థానిక కార్యాలయంలో ఎస్పీని కలిసి మాట్లాడుతూ యోగా ఉపాధ్యాయులుగా మంచి భవిష్యత్ ఉంటుందని పలువురిని నమ్మించి 15 నెలల నుంచి వారితో పని చేయించుకుని జీతాలు ఇవ్వకపోగా, తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న ఫౌండేషను రద్దు చేసి యోగ ఉపాధ్యాయులకు రావలసిన నగదును తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. యోగా ఉద్యోగులు ప్రసాదు, రామకృష్ణారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, శ్రీపార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కమనీయంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు శ్రీదర బాలసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో చేపట్టిన వేడుకలో భాగంగా.. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరింపజేసి పురవీధుల్లో నంది వాహనంపై ఊరేగించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

సంప్రదాయబద్ధంగా ప్రభోత్సవం..

శ్రీలక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, శ్రీపార్వతి సమేత మల్లేశ్వరస్వామి వార్ల ప్రభోత్సవం గురువారం రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి విశేషంగా అలంకరించిన ప్రభపై అధిష్టింపజేశారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య ప్రభను ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివార్లకు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రభోత్సవాన్ని తిలకించేందుకు స్థానికులే గాకుండా ఇతర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.


ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం


ఈద్గా వద్ద బందోబస్త్ నిర్వహిస్తున్న పోలీసులు


రుద్రవరం ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


క్రిష్టిపాడులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


దొర్నిపాడులో..

భక్తిశ్రద్ధలతో రంజాన్


శిరివెళ్ల ఈద్గా వద్ద నమాజు చేస్తున్న ముస్లింలు


చాగలమర్రిలో రంజాన్ ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న ఇమాం హఫీజ్ ముల్లా ముజీబుర్ రెహ్మాన్

ఆళ్లగడ్డ: రంజాన్ మాసం మెదలైనప్పటి నుంచి నియమనిష్టలతో నెల పాటు కఠోర ఉపవాస దీక్షను కొనసాగించిన ముస్లింలు గురువారం ఈద్-ఉల్-ఫితర్‌ను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం మతగురువుల ఆధ్వర్యంలో ర్యాలీగా ఈద్గాల వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం మత గురువులు పండుగ విశిష్టత, అల్లా బోధనలను వినిపించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు నర్సాపురం, ఆలమూరు, ఎల్లావత్తుల, కొండమాయపల్లె, చిన్నకంబలూరు తదితర గ్రామాల్లో ముస్లింలు గురువారం రంజాన్ పర్వదిన వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఉంటూ నిత్యం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చివరి రోజున ఆయా గ్రామాల్లోని మసీదులు, గ్రామ శివారులోని ఈద్గాల వద్దకు అల్లాను ధ్యానిస్తూ ర్యాలీగా వెళ్లి ప్రత్యేక అక్కడ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు రంజాన్ పర్వదిన విశిష్టతను వివరిస్తూ అందరూ సన్మార్గంలో నడవాలని సూచించారు.

శిరివెళ్ల: మండలంలో గురువారం రంజాన్ పండుగ ఘనంగా జరిగింది. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, బోయలకుంట్ల, కోటపాడు, మహదేవపురం, గుంప్రమాన్‌దిన్నె గ్రామాల్లో మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక నమాజు చేశారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దొర్నిపాడు: పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు గురువారం అత్యంత వైభంగా జరుపుకున్నారు. చాకరాజువేముల, దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ కొత్తపలెల, గుండుపాపల, డబ్ల్యూ గోవిందిన్నె, బుర్రారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వేకువజాము నుంచే ఉపవాస దీక్షలు విరమించి నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనలు చేశారు.

ఉయ్యాలవాడ : మండలంలోని గ్రామాల్లో ఈద్గా మైదానాలు అల్లాహు అక్బర్ నినాదంతో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నూరాని, జామియా మసీదుల నుంచి ర్యాలీగా అల్లా నామస్మరణ చేస్తూ కుందూనది ఒడ్డునున్న ఈద్గా వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకున్నారు. మత గురువు షంసులుద్దీన్ రంజాన్ పండుగ ప్రాముఖ్యత, మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని క్లుప్తంగా వినిపించారు. అనంతరం సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ పురస్కరించుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


చాగలమర్రిలో బాబులాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి

చాగలమర్రి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్‌ను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గత నెల 12న ఉపవాస దీక్ష చేపట్టారు. నాటి నుంచి ప్రత్యేక ప్రార్థనలతో గడిపారు. బుధవారం సాయంత్రం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షను, తరావీ ప్రత్యేక నమాజులు విరమించారు. దాన, ధర్మాలు, జకాత్, తదితర పుణ్య కార్యాలు చేపట్టారు. గురువారం ఈద్గాల వద్దకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ మత గురువులైన ఇమాం హఫీజ్ ముల్లా ముజీబుర్ రెహ్మాన్, ఖాజీ ముల్లా యూనుస్ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్, దువా చేపట్టారు.



ఉయ్యాలవాడలో ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు


పెద్దకంబలూరులో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, బీజేపీ వర్గీయులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు, గోనంపల్లె పందిర్లపల్లె గ్రామాలకు చెందిన మోహన్, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, అక్బర్‌బాషా, వెంకటయ్య, ప్రభాకర్, వెంకటసుబ్బయ్య, మరియన్న, చిన్నమాబు, బాలస్వామితో పాటు మరో వంద కుటుంబాలు టీడీపీ,బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి, గంధం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రా రెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

'మహో'దయం!


మహానంది క్షేత్రంపై సువర్ణకాంతులు వెదజల్లుతున్న సూర్యభగవానుడు

ప్రకృతి అందాలకు నెలవు మహానంది క్షేత్రం. నల్లమల అడవి ఒడిలో కొలువు దీరడంతో నిత్యం కొత్తందాలు భక్తులను కనువిందు చేస్తుంటాయి. పచ్చని చెట్లు, పక్షుల కిలకిలరావాలు, గంగమ్మ జల సవ్వడులు పర్యాటకులను అలరిస్తుంటాయి. ఇందులో భాగంగా.. సూర్యోదయ వేళ.. ఆదిత్యుడు నల్లమల కొండల నుంచి బయటపడే సమయంలో పసిడి కాంతులు వెదజల్లడంతో ఆలయ పరిసరాలు బంగారు వర్ణంలో మెరిసిపోయాయి. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులు ఈ దృశ్యాలను చూసిన భక్తులు మహదానందం చెందారు. గురువారం ఉదయం కనిపించిన ఈ దృశ్యాలను సాక్షి కెమెరాలో బంధించింది. - మహానంది

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే


జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత బహుజన నాయకులు

నంద్యాల(అర్బన్)/నంద్యాల(వ్యవసాయం): అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని వక్తలు పేర్కొన్నారు. పూలే జయంతిని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పద్మావతినగర్ ఆర్చ్ వద్దనున్న పూలే విగ్రహానికి దళిత బహుజన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు, ఊకొట్టు వాసు, మస్తాన్‌ఖాన్, హుసేన్‌బాషా, నూర్‌బాషా నివాళులర్పించారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి రాజ్‌కుమార్, లింగస్వామి ఆధ్వర్యంలో, బీజేపీ పార్టీ పార్లమెంటరీ కార్యాలయంలో పార్లమెంటరీ కో ఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొట్టె చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, బాలముని పాల్గొన్నారు.

శ్రీరాముడు ధర్మ స్వరూపుడు

కర్నూలు కల్చరల్: శ్రీరాముడు ధర్మ స్వరూపుడని విశ్రాంత తెలుగు పండితులు గరుడాద్రి వనజకుమారి అన్నారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు 'శ్రీరాముడు – ధర్మ స్వరూపుడు' అంశంపై ఉపన్యసించారు.

నివాళి

చాగలమర్రి: స్థానిక శివాలయం వీధికి చెందిన షేక్ జమాల్‌బాషా (28) బుధవారం బనగానపల్లె పట్టణ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం జమాల్‌బాషా మృతదేహాన్ని గురువారం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో మృతదేహాన్ని గురువారం మధ్యాహ్నం చాగలమర్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి చాగలమర్రికి చెరుకొని జమాల్‌బాషా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న నేలంపాడు సర్పంచ్ ప్రతాప్‌రెడ్డిని ఇంటి వద్దకెళ్లి పరామర్శించారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.


జమాల్‌బాషా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

ఆరేళ్లుగా అన్నం ముట్టలేదు!


ఆసనాలు వేస్తున్న శివన్న

మహానంది: ఆయన వయసు 65ఏళ్లు. ఆరేళ్లుగా అన్నం తీసుకోవడం లేదు. కేవలం మంచినీళ్లు, పండ్ల రసాలు మాత్రమే ఆహారం. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాడి సిదారం గ్రామానికి చెందిన శివన్న నాలుగు ఎకరాల్లో జొన్నలు, గోధుమలు సాగు చేస్తున్నాడు. మహానంది మండలం బుక్కాపురంలోని ఆయన బంధువులైన చాకలి చిన్నోడు ఇంటికి పెళ్లి కార్డులు ఇవ్వడానికి గురువారం వచ్చాడు. ఆయన యోగాసనాలు చేస్తుండటంపై ప్రశ్నించగా పలు విషయాలను వెల్లడించారు. శివన్నకు శివుడంటే ఎంతో భక్తి. తనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. నిత్యం శివారాధన చేసే శివన్న 12 ఏళ్ల పాటు అన్నం, మాంసాహారం, ఘన పదార్థాలు ముట్టనని దీక్ష తీసుకున్నాడు. అందులో భాగంగానే ఇప్పటికే ఆరేళ్ల గడిచాయి. కేవలం ద్రవ పదార్థాలైన పండ్ల రసాలు, మంచినీరు మాత్రమే తీసుకుంటున్నాడు. ఇప్పటి వరకు తనకు ఎలాంటి అనారోగ్యం తలెత్తలేదని చెప్పాడు. మరో ఆరేళ్ల పాటు అన్నం ముట్టనన్నాడు. నిత్యం యోగాసనాలు చేస్తానని, పొలాల్లో పనులు సొంతంగా చేసుకుంటానని వివరించారు.


మంటలను అదుపు చేస్తున్న దృశ్యం


చెలరేగిన మంటలు

తప్పిన ప్రమాదం

మిడుతూరు: మండలంలోని జలకనూరు గ్రామ శివారులో (మంచాలకట్ట రహదారి) గుర్తు తెలియన వ్యక్తులు జమ్ముగడ్డికి నిప్పుపెట్టడంతో మంటలు మైనార్టీ కాలనీకి వ్యాపించాయి. అప్రమత్తమైన గ్రామస్తులు బిందెలతో నీటిని తీసుకెళ్లి మంటలు అదుపులోకి తీసుకురావడానికి యత్నించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐ జగన్‌మోహన్ ఘటనాస్థలానికి చేరుకొని జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ చొరవతో సోలార్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఫైర్ ఇంజిన్ పంపారు. గ్రామానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్ సిబ్బంది స్థానికులతో కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా మంటలు అదుపులోకి రాకపోతే పలు గడ్డి వాములు పూర్తిగా దగ్ధమయ్యేవని గ్రామస్తులు తెలిపారు. జిల్లా ఎస్పీ, రూరల్ సీఐ, ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్


సాయిబాబానగర్ ఈద్గాలో సందేశం ఇస్తున్న మౌలానా


నంద్యాల ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా


భీమవరం రస్తాలోని ఆల్‌ఫుర్ఖాన ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మౌలానా

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో ముస్లింలు రంజాన్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. నెల రోజుల కఠిన ఉపవాసం తర్వాత జరుపుకునే ఈద్-ఉల్-ఫితర్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద రంజాన్ ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలింగనం చేసుకొని ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక ఎస్సార్బీసీ రస్తాలోని థయిబా ఈద్గా, భీమవరం రస్తాలోని ఆల్‌ఫుర్ఖానా ఈద్గా, సాయిబాబానగర్ ఖుబ్రా ఈద్గా, బొమ్మలసత్రం ఈద్గా, శాంతిరాం మెడికల్ కళాశాల వద్ద సున్నీఈద్గా, దేవనగర్ ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మౌలానాలు పవిత్ర రంజాన్ గురించి, ఖురాన్ బోధనలను వివరించారు. దివ్య ఖురాన్ మానవాళికి మార్గదర్శకమని, జాతీయతకు, సాంస్కృతికి, వికాసానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఆల్‌ఫుర్ఖానా ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మసీదులు, ఈద్గాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

నంద్యాల మండలంలో..

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలూరు, అయ్యలూరు, కానాల, చాబోలు, చాపిరేవుల, భీమవరం, మిట్నాల తదితర గ్రామాల్లో గురువారం ఉదయం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఖురాన్ బోధనల గురించి వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనాలు చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గోస్పాడులో..

మండలంలోని గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఖాజీలు రంజాన్ సందేశం ఇచ్చారు. పండుగ సందర్భంగా దాన ధర్మాలు చేశారు. అనంతరం బంధు మిత్రులతో విందు భోజనాలు ఆరగించారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


అల్‌ఫుర్ఖాన ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


ఈద్ ముబారక్ తెలుపుకుంటున్న ముస్లింలు

ఉత్సవాల విజయవంతంపై సిబ్బందికి అభినందనలు


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలం టెంపుల్: ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు శ్రీశైల మహా క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతంగా పూర్తవడంపై గురువారం ఉదయం ఈఓ పెద్దిరాజు దేవస్థాన పరిపాలన భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి రవణమ్మ, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ దేవస్థానములోని అన్ని విభాగాల పనితీరును ప్రశంసిస్తూ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఉత్సవాల కంటే పది రోజుల ముందు నుంచే భక్తులు క్షేత్రాన్ని చేరుకున్నారని, భక్తులందరికీ ఎలాంటి ఇక్కట్లు కలుగకుండా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమష్టి కృషితోనే విజయవంతం చేయగలిగామన్నారు. అన్ని విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది సమన్వయముతో విధులు నిర్వర్తించారని కొనియాడారు.

ఉన్నతాధికారుల దిశానిర్దేశం..

జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు ఎస్పీ దిశానిర్దేశంతో ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టామన్నారు. వారు పరిస్థితులకనుగుణంగా తగు సూచనలు చేస్తూ ఉత్సవాలు విజయవంతమవ్వడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పోలీస్, వైద్య, అటవీ తదితర శాఖలు తమ వంతు పాత్ర పోషించాయన్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులు ప్రసంగించారు. చివరగా దేవస్థానం సిబ్బంది ఈఓను సత్కరించారు. అలాగే అర్చకస్వాములు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి ఈఓ శ్రీస్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాలను అందజేసి సత్కరించారు.